సాక్షి
ఏలూరు
శనివారం । 23 । ఆగస్టు । 2025



మొక్కజొన్నలో మెలకువలు

ఖరీఫ్ మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ అధికారి వివరించారు.

8లో ▸



ప్రాణం తీసిన కూటమి నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో 108 వాహనం పూర్తి సామర్థ్యంతో నడవకపోవడంతో ఓ యువకుడి ప్రాణం గాలిలో కలిసిపోయింది.

8లో ▸



యోగాతో ఆరోగ్యం

రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు రెండో రోజు ప్రత్తిపాడులో కొనసాగాయి.

8లో ▸

రాయితీ ఎగ్గొట్టేందుకు కుట్ర

అయ్యా.. యూరియా

- యూరియా దొరక్క రైతుల అవస్థలు
- సొసైటీల వద్ద పడిగాపులు
- పట్టించుకోని కూటమి సర్కారు



పోలవరం మండలం గూటాలలో సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఏలూరు (మెట్రో): జిల్లాలో యూరియా కొరతతో రైతులు అల్లాడుతున్నారు. సొసైటీల వద్ద పడిగాపులు, రోజంతా నిరీక్షణలు అన్నదాతలకు నిత్యకృత్యమయ్యాయి. యూరియా కొరత లేదని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. గతేడాది నుంచి రైతులకు సరఫరా తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతూనే ఉంది. దీనిలో భాగంగా ఏటా అందించే యూరియా కోటాలో 1,000 టన్నులను గతేడాది తగ్గించింది. ఇలా యూరియాపై సబ్సిడీని ఎగ్గొట్టేందుకే కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఏలూరులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో యూరియా కొరత, కౌలు రైతుల దయనీయ పరిస్థితులపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.

కాల'కూటమి' విషం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. రైతు భరోసా సాయాన్ని ఏడాది పాటు నిలిపివేయడంతో పెట్టుబడుల కోసం రైతులు అవస్థలు పడ్డారు. అలాగే గ్రామాల్లో పూర్తిస్థాయిలో సేవలందిస్తున్న రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేస్తోంది. దీంతో రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందడం లేదు. ప్రధానంగా సీజన్ ప్రారంభంలో రైతులకు సమృద్ధిగా అందించాల్సిన యూరియాను సరఫరా చేయడంలో కూటమి సర్కారు ఘోరంగా విఫలమైంది.

గతమెంతో ఘనం.. ప్రస్తుతం ఎగనామం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా 2022–23లో జిల్లాలో 26,591 టన్నులు, 2023–24లో 26,090 టన్నుల యూరియాను రైతులకు అందించారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ సీజన్‌లో 33,762 టన్నుల యూరియా అవసరమని గుర్తించగా ఇప్పటివరకూ కేవలం 8 వేల టన్నుల మాత్రమే సరఫరా చేశారు. ఇక ఈ నెలలో 10,183 టన్నుల అవసరం అని అధికారిక గణాంకాలు చెబుతుంటే 5,496 టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉంచారు.

రోజంతా ఉన్నా ఒక్క బస్తానే..

రైతులకు ఎరువులు, పురుగు మందులు అందించడంతో కూటమి ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో రైతులకు ఎంత కావాలంటే అంత యూరియా అందుబాటులో ఉంచారు. యూరియా బస్తా ధర రూ.2,500కుపైగా ఉండగా రైతులకు రూ.266కు మాత్రమే ప్రభుత్వం సబ్సిడీపై అందించాల్సి ఉంది. ఈ మేరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో రైతులకు యూరియాను సరఫరా చేశారు. అయితే ప్రస్తుతం ఆ సబ్సిడీ భారం తగ్గించుకునేందుకు కూటమి సర్కారు రైతులను ముప్పుతిప్పలు పెడుతుంది.

రైతులు క్యూలో నిలబడి సొసైటీల వద్ద రోజంతా పడిగాపులు పడితే ఒక్క బస్తా మాత్రమే ఇస్తున్నారు. అది కూడా రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తేనే పంపిణీ చేస్తున్నారు.

గూటాల సొసైటీ వద్ద బారులు

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల సొసైటీ వద్ద శుక్రవారం రైతులు బారులు తీరారు. యూరియా వచ్చిందన్న సమాచారంతో తమకు ఇస్తారో లేదోనన్న ఆందోళనలో క్యూ కట్టారు. నాట్లు వేసిన పొలాలకు కలుపు తీసి యూరియాను చల్లుతున్నారు. ఈ సమయంలో యూరియా అవసరం అధికంగా ఉండటంతో రైతులు పెద్ద ఎత్తున సొసైటీ వద్దకు చేరుకున్నారు. రైతులకు యూరియాతో పాటు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించినట్లు వ్యవసాయాధికారి తెలిపారు. 1,500 ఎకరాలకు సరిపడా యూరియా, నానో యూరియా అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

చాలా ఇబ్బంది పడుతున్నాం



గతంలో జిల్లాలో యూరియా ఇబ్బందులు లేవు. ప్రస్తుతం ఒక్క యూరియా బస్తా కావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సొసైటీల వద్ద పడిగాపులు తప్పడం లేదు. మొబైల్‌కు ఓటీపీ వస్తేనే రైతులకు యూరియా ఇవ్వాలన్న నిబంధనతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– కోన శ్రీనివాసరావు, అడవికొలను

ఆందోళనలకు సిద్ధం



జిల్లాలో రైతులకు యూరియా అందించేందుకు చర్యలు తీసుకోవాలి. లేదంటే ఆందోళనకు సిద్ధమవుతాం. గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాలో యూరియా కొరత నెలకొంది. నానో ఎరువుల పేరుతో అధికారులే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని అనుమానంగా ఉంది.

– కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో కర్నాటక న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి సుమలతకు జ్ఞాపికను అందిస్తున్న డీఈఓ భద్రాజీ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిల్లాకుర్ సుమలత శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు ఆమెకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ డీఈఓ భద్రాజీ స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

25న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెగా డీఎస్సీ–2025కు సంబంధించి లాగిన్‌కు సమాచారం కాపీ వచ్చిన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ లాగిన్‌కు వచ్చిన కాపీలను డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 25న ఏలూరులోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు రావాలని సూచించారు. సర్టిఫికెట్లు అన్నింటినీ మూడు సెట్లు అటెస్టేషన్ చేయించుకుని తీసుకురావాలని తెలిపారు. డీఎస్సీ హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, ఐదు పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకురావాలన్నారు. అభ్యర్థులు తమ సహాయకులిగా ఒకరిని మాత్రమే తీసుకురావాలని, అభ్యర్థులు ముందుగా ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు.

సరిపడా ఎరువుల నిల్వలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని, కొరత లేదని కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర మంత్రి కింజారపు అచ్చెన్నాయుడికి తెలియజేశారు. రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో సీజన్‌కు అవసరమైన ఎరువులు, డీఏపీ నిల్వలు ఉన్నాయన్నారు.

జోన్ ఉల్లంఘనలపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో తీర ప్రాంత నియంత్రణ జోన్ ఉల్లంఘనపై అందిన ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో తీర ప్రాంత నియంత్రణ జోన్ ఉల్లంఘనకు సంబంధించిన మూడు అంశాలపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. నరసాపురంలోని వశిష్ట గోదావరి నది ఒడ్డున ఘన వ్యర్థాలను పారవేయడంపై, నరసాపురం మండలం పీచుపాలెం, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో అక్రమ రొయ్యల సాగు, మొగల్తూరు మండలం కేపీ పాలెం సౌత్ గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకం, అనధికార రొయ్యల చెరువు తవ్వకంపై ఫిర్యాదులు, వచ్చే నెల 20న నిర్వహించనున్న బీచ్ క్లీనింగ్ కార్యకలాపాలు, ప్రచారాలపై సమీక్షించారు.

'ముత్తూట్' మేనేజర్ చేతివాటం

నరసాపురం: నరసాపురం ముత్తూట్ ఫిన్‌కార్ప్ యూనిట్‌లో మేనేజర్ వినోద్ చేతివాటం చూపించారు. ఖాతాదారుల ఈఎంఐ సొమ్ములను సొంత ఖర్చులకు వాడుకున్నారు. కొంతకాలంగా జరుగుతున్న ఈ బాగోతం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ యూనిట్‌లో అప్పులు తీసుకున్న 26 మంది ఖాతాదారులకు హెడ్ ఆఫీస్ నుంచి నోటీసులు రావడంతో వారంతా కార్యాలయానికి వచ్చి నిలదీశారు. భీమవరానికి చెందిన వినోద్ మూడేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఖాతాదారుల్లో నిరక్షరాస్యుల లక్ష్యంగా ఈ తరహా మోసాలకు పాల్పడుతూ జల్సాలు చేస్తున్నట్టు తెలిసింది. ఈఎంఐ బకాయిలు ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వసూలు చేసిన సొమ్మును ఖాతాల్లో జమచేయడం లేదని, ఇలా రూ.11 లక్షల వరకు మోసం చేసినట్టు తెలిసింది. ఈఎంఐ సొమ్ములను తన సొంత ఫోన్‌పే ఖాతాకు జమచేసుకున్నట్టు సమాచారం. బాధితుల సంఖ్య మరింత ఉండవచ్చని భావిస్తున్నారు. వినోద్‌పై సంస్థ ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇంటి, వ్యాపార రుణాలు ఇప్పిస్తానని చెప్పి పలువురి నుంచి వినోద్ రూ.లక్షల్లో వసూలు చేసినట్టు చెబుతున్నారు.

మూల్యాంకన విధానంతో సమస్యలు

భీమవరం: పరీక్షల నిర్వహణలో కొత్త మూల్యాంకన విధానం సమస్యలకు దారి తీస్తుందని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా అ ధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ మాట్లాడుతూ నూతన విధానం బోధనా సమయాన్ని హరిస్తుందన్నారు. మార్కుల నమోదు ఉపాధ్యాయులకు పని భారంగా మారిందన్నారు. ఆన్‌లైన్ విధానంలో నమోదుకు మాత్రమే పరిమితం చేసి మిగిలిన నమోదు నుంచి వెసులుబాటు కల్పించాలన్నా రు. కొత్త విధానం వల్ల ఫలితాల కంటే నష్టమే ఎక్కువ ఉందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు జి.ప్రసన్నకుమార్ రమేష్, నాగరత్నాలు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సుతో ఉపాధికి గండి



ఏలూరులో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లు కిరాయిలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని, ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.గోపి, చక్రాల అమర్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని వారి కుటుంబాలకు భరోసా ఇచ్చేలా వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. రవాణా రంగం ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా రవాణా రంగ కార్మికులకు, ఆటో డ్రైవర్లకు సంక్షేమ చట్టాన్ని అమలు చేయకపోవడం ప్రభుత్వాల అసమర్థతకు నిదర్శనమన్నారు. భారీగా ఆటోలతో ర్యాలీని నిర్వహించడంలో బొడ్డేపల్లి చంద్రశేఖర్, బి.శ్రీనాథ్, అడ్డాల రాజు, నల్లమిల్లి నాగరాజు, బాష, శ్రీనివాసరావు, రాము ఇతర ఆటో యూనియన్ నాయకులు నాయకత్వం వహించారు. సీఐటీయూ నగర నాయకులు వైఎస్ కనకారావు, ఎం.ఇస్సాకు, పి.రవి మద్దతు తెలిపారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా?

ఏలూరు (టూటౌన్): నానో యూరియా అమ్మకాలు పెంచుకునేందుకు అధికారులే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా అని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రశ్నించారు. స్థానిక అన్నే భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ యూరియా కోసం రైతులు సొసైటీలు, ఎరువుల షాపుల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందన్నారు. కొరత లేదని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు యూరియా దొరకడం లేదన్నారు. కొన్నిచోట్ల యూరియాను అధిక ధరలకు అమ్ముతున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. రైతులకు అవసరమైన యూరియాను పూరిస్థాయిలో అందుబాటులో ఉంచాలని లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ' నిలిపివేతపై ఆందోళన

- భీమవరం వర్మ ఆస్పత్రిలో సేవలు నిలిపివేస్తూ ఉత్తర్వులు
- కలెక్టరేట్‌కు చేరిన డయాలసిస్ రోగులు, బంధువులు



భీమవరం కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌ఓ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రోగులు, బంధువులు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలోని వర్మ ఆస్పత్రి (ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రి)లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తూ ఎన్టీఆర్ వైద్య ట్రస్ట్ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం నుంచి ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. కేసుల విషయంలో అవకతవకలు జరిగినట్టు ఆడిట్, రాష్ట్రస్థాయి కమిటీ విచారణలో గుర్తించడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో ఉచిత సేవలు పొందుతున్న సుమారు 200 మంది డయాలసిస్ రోగులు తీవ్ర ఆందోళన చెందారు. వైద్య సేవలు నిలిపివేస్తే తమ ప్రాణాలకు ముప్పు తప్పదని భయపడ్డారు. రోగులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి భీమవరంలోని కలెక్టరేట్‌కు వెళ్లి జాయింట్ కలెక్టర్, డీఎంహెచ్‌ఓను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్లక్ష్యం, అధికారుల నిర్లిప్తత కారణంగా తమ ప్రాణాలను పణంగా పెట్టవద్దని బోరుమన్నారు. అకస్మాత్తుగా సేవలు నిలిపివేస్తే తమ పరిస్థితి ఏంటని వాపోయారు. తమకు అక్కడే సేవలు కొనసాగించాలని కోరారు. ఇదిలా ఉండగా ఆస్పత్రికి వచ్చిన పలువురు రోగులు సేవలు నిలిపివేయడంతో ఇబ్బందులు పడ్డారు.

సేవలు కొనసాగించేందుకు చర్యలు: డీఎంహెచ్‌ఓ

కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం వర్మ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలో డయాలసిస్ సేవలు పొందుతున్న వారికి అక్కడే డయాలసిస్ సైకిల్స్ పూర్తయ్యే వరకూ సేవలందించేందుకు చర్యలు తీసుకున్నామని డీఎంహెచ్‌ఓ గీతాబాయి తెలిపారు. తర్వాత జిల్లాలో రోగులకు సమీపంలో ఉన్న డయాలసిస్ యూనిట్‌లకు తరలిస్తామని, డయాలసిస్‌కు సంబంధించి కొత్త కేసులకు వర్మ ఆస్పత్రిలో అడ్మిషన్లు ఉండవని చెప్పారు.



ప్రభుత్వ నిర్లక్ష్యం.. 108 వా'హననం'

అపర సంజీవనిగా పేర్గాంచిన 108 వాహనాలు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాలగర్భంలో కలిసిపోతున్నాయి. పేదోడి ప్రాణాలను కాపాడే వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చిన్నపాటి మరమ్మతులు వచ్చినా నిధులు మంజూరు చేయకపోవడంతో కూనరిల్లుతున్నాయి. ఇలా ఏలూరు సర్వజన ఆస్పత్రిలో మూలకు చేరిన వాహనాల చుట్టూ మట్టి పోశారు. కొన్ని వాహనాల చుట్టూ మొక్కలు మొలిచాయి. పేదల ఆరోగ్యంపై ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో ఈ చిత్రాలను చూస్తే అర్థమవుతుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

● వరలక్ష్మీ.. వరప్రదాయినీ



అనివేటి మండపంలో వేదికపై వ్రత వేడుక జరిపిస్తున్న అర్చకులు



అమ్మవారికి నీరాజనాలు అర్పిస్తున్న భక్తులు

ద్వారకాతిరుమలలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తూర్పు రాజగోపుర ప్రాంతంలోని అనివేటి మండపంలో ప్రత్యేక వేదికపై అమ్మవారిని వేంచేపు చేశారు. అర్చకులు, పండితులు ఉత్సవమూర్తికి విశేష పుష్పాలంకారాలు చేసి వ్రత పూజ ప్రారంభించారు. అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో సుమారు 3 వేల మందికి పైగా మహిళలు వ్రత వేడుకల్లో పాల్గొని అమ్మవారిని పూజించారు. వేడుక అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, రవికలు, ప్రసాదాన్ని అర్చకులు అందించారు. ముందుగా ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తి సతీమణి అమ్మవారికి పసుపు, కుంకుమలు, పూలు, పండ్లను అందజేశారు. ఈఓ సత్యనారాయణమూర్తి, డీఈఓ భద్రాజీ, ఏఈఓలు పి.నటరాజారావు, మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్లు జి.సుబ్రహ్మణ్యం, దుర్గాప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నూలి అరాచకాల నుంచి రక్షించండి

బీజీబీఎస్ మహిళా కళాశాల వ్యవహారంలో రోడ్డెక్కిన మరో కుటుంబం



నరసాపురం కన్నీటి పర్యంతమవుతున్న కిన్నెర, శ్రీను దంపతులు

నరసాపురం: నరసాపురంలోని పద్మశ్రీ అద్దేపల్లి సర్విశెట్టికి చెందిన బీజీబీఎస్ మహిళా కళాశాల పాలకవర్గం వ్యవహారాలపై రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతోంది. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ రౌడీలను పెట్టి తమను ఇల్లు కదలకుండా చేస్తున్నారని, స్థలాన్ని, ఇంటిని దౌర్జన్యంగా ఖాళీ చేయిస్తున్నారని వెలిగట్ల కిన్నెర, శ్రీను దంపతులు శుక్రవారం ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తమకు ఆత్మహత్యే శరణ్యమని విలేకరుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు 55 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా పట్టణం నడిబొడ్డున విజయలక్ష్మి కంటి ఆస్పత్రి వద్ద కళాశాల యాజమాన్యం 99 ఏళ్లకు లీజుకిచ్చిన స్థలాన్ని హస్తగతం చేసుకుని 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమను రోడ్డు పాలు చేయాలని చూస్తున్నారని కిన్నెర దంపతులు వాపోయారు. ఇదిలా ఉండగా సర్విశెట్టి ఆస్తుల విషయంలో జరుగుతున్న అన్యాయంపై అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా ఉంటున్న వారికి కనీసం నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యం చేయడం తగదన్నారు. మరోవైపు కళాశాల ఆస్తులు నూలి శ్రీనివాస్ అమ్ముకుంటుంటే తాము ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దళిత ఉద్యమ నేత చింతపల్లి గురుప్రసాద్ మాట్లాడుతూ నరసాపురంలో మహిళలపై అరాచకాలు, దౌర్జన్యాలు జరుగుతుంటే పవన్‌కల్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలతోనే ఇవన్నీ జరుగుతున్నాయన్నారు.

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్‌లో బాలికల విజయం



జోనల్ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన ఏలూరు జిల్లా బాలికల జట్టు

ఏలూరు రూరల్ : ఏలూరు జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్టు విజయం సాధించింది. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అమరావతి చాంపియన్‌షిప్ కప్ పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 21న కాకినాడలో జోన్–2 పోటీలు జరిగాయి. బాస్కెట్‌బాల్ విభాగంలో ఏలూరు జిల్లా బాలికల జట్టు కోనసీమ జిల్లా జట్టుపై 24–59, పశ్చిమగోదావరి జిల్లా జట్టుపై 35–16 స్కోర్‌తో గెలిచి విజేతగా నిలిచింది. విజేత జట్టు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుంది.

బీజేపీ ఉపాధ్యక్షుడిగా సీతారామాంజనేయ చౌదరి



దెందులూరు: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఆయన నియామకంతో స్వగ్రామం దెందులూరు మండలం కొవ్వలిలో, పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన అభిమానులు పార్టీ నాయకులు స్వీట్లు పంచారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా భీమారావు



తణుకు అర్బన్: సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా కోనాల భీమారావు రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తణుకులో రెండు రోజులపాటు నిర్వహించిన సీపీఐ జిల్లా మహాసభల్లో తొమ్మిది మందితో జిల్లా కార్యవర్గం, 31 మందితో జిల్లా సమితి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు భీమారావు చెప్పారు.

అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానానికి స్వస్తి పలకాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న నూతన అసెస్‌మెంట్ బుక్‌లెట్ మూల్యాంక విధానం వల్ల విద్యార్థులకు అదనపు ఉపయోగం లేదని, ఆ విధానానికి స్వస్తి పలకాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. పాత పద్ధతినే కొనసాగించాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డి దొర కోరారు.

ప్రాణం తీసిన కూటమి నిర్లక్ష్యం

- మృత్యుశకటాలుగా 108 అంబులెన్స్‌లు
- రోడ్డు ప్రమాద క్షతగాత్రుడి తరలింపునకు 2 గంటలు సమయం
- అంబులెన్స్‌కు బ్రేకులు, లైట్లు, డోర్‌లు తాళ్లతో కట్టిన వైనం
- ఏలూరు జీజీహెచ్‌కు చేరేలోపే యువకుడి మృతి



మృతుడు గోపీకృష్ణ (ఫైల్)

ఏలూరు టౌన్ : 108 అంబులెన్స్‌లు మృత్యు శకటాలుగా మారాయి. బ్రేకులు లేకపోవటంతో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడు ఏలూరు జీజీహెచ్‌కు తరలించేలోపే ప్రాణాలు కోల్పోయాడు. 25 కిలోమీటర్ల లోపు దూరం వెళ్లేందుకు 2 గంటలకు పైగా సమయం పట్టటంతో క్షతగాత్రుడు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. అంబులెన్స్‌లు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో నడవలేని స్థితికి చేరాయి. ఈ నేపథ్యంలో ఏలూరు జీజీహెచ్ వద్ద మృతుడి బంధువులు, స్నేహితులు శుక్రవారం రాత్రి ఆందోళన చేపట్టారు.



కనీసం డోర్ హ్యాండిల్స్ లేని 108 అంబులెన్స్



అంబులెన్స్ లైట్ల వద్ద తాళ్ళతో కట్టిన వైనం



డోర్స్‌ను గుడ్డతో కట్టిన దృశ్యం

బాధితుల కథనం మేరకు.. ఏలూరు వన్‌టౌన్ నాగేంద్రకాలనీకి చెందిన వీ.గోపీకృష్ణ (20) నగరంలోని మెడికల్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వస్తుండగా.. కామవరపుకోట మండలం ఆడమిల్లి వద్ద ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు 108కు ఫోన్ చేశారు. తాపీగా స్పందించిన 108 జిల్లా అధికారులు కామవరపుకోట పీహెచ్‌సీ నుంచి సంఘటనా స్థలానికి బ్రేకులు లేని అంబులెన్స్‌ను పంపించారు. బ్రేకులు లేకపోవటం, లైట్లు వెలగని దుస్థితిలో డ్రైవర్ చేసేదేమీ లేక మెల్లగా డ్రైవ్ చేస్తూ వచ్చాడు. కనీసం సైరన్, హారన్ కూడా లేకపోవటం గమనార్హం. ఈ లోగా మృతుడి స్నేహితులు, బంధువులు ప్రశ్నించగా బ్రేకులు లేవని డ్రైవర్ చెప్పాడు. దీంతో స్నేహితులంతా 108 అంబులెన్స్‌కు ముందు పైలట్స్‌గా వ్యవహరిస్తూ వాహనానికి అడ్డులేకుండా నగరంలోని ఆంధ్రా హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం బాధితుడి బంధువులు, స్నేహితులు అంబులెన్స్‌ను ఏలూరు జీజీహెచ్‌కు తీసుకువచ్చారు.

సమయానికి 108 వస్తే బతికేవాడు


ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకుని ఉంటే.. తమ స్నేహితుడు ప్రాణాలతో ఉండేవాడని మృతుడి స్నేహితుడు మనోహర్ వాపోయాడు. సుమారు 2గంటలకు పైగా సమయం పట్టిందని, ఇలాంటి వాహనాలను ఏ విధంగా వినియోగిస్తారో చెప్పాలంటూ ప్రశ్నించాడు. క్షతగాత్రుడిని రక్షించేందుకు బ్రేకులు, లైట్లు, సైరన్ లేని అంబులెన్స్ ఎలా పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి

ఏలూరు (టూటౌన్) : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించాలని, అర్హులైన వారందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, గోదావరి వరద ముంపుకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.రవి శుక్రవారం మాట్లాడుతూ కేవలం వరదలు వచ్చినప్పుడే కాకుండా గోదావరి వరద ముంపు కు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వరదల సందర్భంగా అధికారులు ప్రజలను కాలనీలకు తరలించి చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. కాలనీలో కనీస మౌలిక సౌకర్యాలు లేక నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసిత కాలనీలు నిర్మించి రెండేళ్లు పూర్తి కాకముందే వర్షాలు పడితే ఇళ్లు కారిపోయే పరిస్థితి ఉందని, కాలనీలో తాగేందుకు మంచినీళ్ళు, సరైన మరుగుదొడ్లు, వీధిలైట్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దోమలతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇవ్వవలసిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అర్హులైన వారందరికీ సక్రమంగా ఇవ్వాలని, పూర్తిస్థాయి సౌకర్యాలతో పునరావాస కాలనీలు ఏర్పాటు చేయాలన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆకట్టుకున్న విద్యార్థుల యోగాసనాలు





యోగాతో ఆరోగ్యం.. ఆహ్లాదం


రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు రెండో రోజు శుక్రవారం పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడు సరస్వతి విద్యాలయంలో కొనసాగాయి. వ్యక్తిగత, జంట విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఐదు రకాల వయసు విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో 23 జిల్లాల నుంచి యోగ సాధకులు పాల్గొన్నారు. 24 మందిని విజేతలను ప్రకటించారు. వీరికి నిట్ డీన్ జీఆర్కే శాస్త్రి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. పోటీలు 24 వరకు జరగనున్నాయి.

– తాడేపల్లిగూడెం(టీఓసీ)



మొక్కజొన్న సాగులో మెలకువలు

చింతలపూడి: మొక్కజొన్న పంటను వర్షాధారంగా, సాగునీటి కింద పండిస్తారు. ఆహార పంటగానే కాకుండ దాణా రూపంలో పశువులకు మేతగా, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగా, పేలాల పంటగా, కాయగూర రకంగా రైతులు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగు వివరాలను సహాయ వ్యవసాయ సంచాలకులు వై.సుబ్బారావు రైతులకు సూచించారు.





మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ మొక్కజొన్న సాగు

ఎలాంటి నేలలు అనుకూలం

- మురుగునీరు పోయే లోతైన ఎర్రగరప, మధ్యస్థ నల్ల నేలలు బాగా అనుకూలం. నేలలో తేమను పట్టి ఉంచే గుణం ఉండాలి.
- నీరు నిల్వ ఉండే ముంపు నేలలు, చౌడు నేలల్లో మొక్కజొన్న దిగుబడి సరిగా రాదు. నేల ఉదజని సూచిక 6.5 నుంచి 7.5 మధ్య ఉండాలి.

విత్తే సమయం

సాధారణంగా జూన్ 15 నుంచి జూలై నెలాఖరులోగా విత్తుకోవాలి. వర్షాలు ఆలస్యంగా కురిస్తే నీటి వసతి కింద స్వల్పకాలిక హైబ్రీడ్ రకాలు ఆగస్టు నెలలో కూడ విత్తుకోవచ్చు.

అనువైన రకాలు

- దీర్ఘకాలిక రకాలు (100–120) రోజులు: డీఎచ్‌ఎం –113, 900 ఎం గోల్డ్, బయో 9861, ప్రో–311, 30బి07
- మధ్య కాలిక రకాలు (90–100 రోజులు) : డీఎచ్‌ఎం–111, 117, 119, కెహెచ్–510, బయో–9657, కెఎం–9541, ఎంసిహెచ్–2
- స్వల్పకాలిక రకాలు (కాల పరిమితి 90 రోజుల కంటే తక్కువ) : డీఎచ్‌ఎం– 115, ప్రకాశ్ కెహెచ్–5991, జెకెఎంఎచ్–1701–డికెసి–7074 ఆర్, ఎంఎంఎచ్–1701, డికెసి– 7074 ఆర్, ఎంఎంఎచ్– 133,3342.
- ప్రత్యేక రకాలు తీపి మొక్కజొన్న (స్వీట్ కార్న్): మాధురి, ప్రియ, విన్ ఆరెంజ్, అల్మోరా
- స్వీట్ కార్న్ రకాలు : సుగర్–75, బ్రైట్‌జేన్ సంకర రకాలు

విత్తే విధానం

ఎకరాకు సంకర రకాలైతే 7–8 కిలోల విత్తనం వాడి 60 సెంటీమీటర్లు ఎడంగా బోదెలు చేసి సాళ్ళలో 20 సెం.మీ ఎడంగా విత్తాలి. ఇలా విత్తితే ఎకరాకు సుమారు 33,333 మొక్కలు వస్తాయి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ లేదా డైథేన్ ఎం .45 చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసి బోదెకు ఒక పక్కగా విత్తాలి.

ఎరువుల వాడకం

ఖరీఫ్ పంటలో ఎకరాకు 72–80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులు వాడాలి. మొత్తం పొటాష్, భాస్వరం ఎరువులను పంట విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఒక వేళ జింక్ లోపం ఉంటే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్‌లోపం గమనిస్తే జింక్ సల్ఫేట్ (20 గ్రా) పిచికారీ చేయాలి.

కలుపు నివారణ

పంట విత్తాక 45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. మొక్కజొన్న పంటను ఏక పంటగా వేసినప్పుడు నేల రకాన్ని బట్టి ఎకరాకు 800–1200 గ్రా, అట్రాజిన్ పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట విత్తిన వెంటనే లేదా 2–3 రోజుల్లోగా పిచికారీ చేసి కలుపును నివారించవచ్చు. వెడల్పాటి కలుపు మొక్కల నివారణకు విత్తిన 30 రోజుల తర్వాత ఎకరాకు అరకిలో 2,4–డి సోడియం సాల్ట్‌తో పిచికారీ చేయాలి.

నీటి తడులు



వై.సుబ్బారావు- సహాయ వ్యవసాయ సంచాలకుడు, చింతలపూడి సబ్ డివిజన్

వర్షాధారంగా సాగు చేసినా పూత దశలో వర్షాభావ పరిస్థితులేర్పడితే వీలున్న చోట నీరు తడిపితే మంచి దిగుబడులు వస్తాయి. పూత దశ, గింజలు ఏర్పడే దశల్లో నీటి ఎద్దడి లేకుండ చూసుకోవాలి. పైరు తొలి దశలో పొలంలో నీరు నిల్వ లేకుండ జాగ్రత్తలు తీసుకోవాలి.

సస్యరక్షణ

పైరు తొలి దశలో ఆశించే మొవ్వ తొల్చే పురుగు నివారణకు ముందు జాగ్రత్తగా విత్తిన 10–12 రోజులకు పైరుపై మోనో క్రోటోఫాస్ (1.6 మి.లీ) లేదా కోరా.ఎన్ 3 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్బో ఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు 25–30 రోజుల దశలో ఆకు సుడుల్లో వేయాలి. ఆకు మాడు తెగులు నివారణకు మాంకోజెబ్ (2.5 గ్రా) లీటర్ నీటిలో కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. పొడ తెగులు లక్షణాలు కనిపిస్తే మొక్క దిగువనున్న 2–3 ఆకులు తుంచివేసి ప్రొపికొనజోల్ (1 మి.లీ) లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొక్క ఎండు, కాండం మసికుళ్ళు తెగుళ్ళు రాకుండా ముందు జాగ్రత్తగా ఎదుర్కొనే రకాల సాగు, పంట మార్పిడి , వేసవిలో లోతు దుక్కులు , పూత దశ తర్వాత నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కైకలూరులో కోర్టు ఆవరణలో న్యాయవాదులతో మంత్రి ఫరూఖ్, ఎమ్మెల్యే కామినేని

కై కలూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ న్యాయవాదులు న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండీ ఫరూఖ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కైకలూరు కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ అధ్యక్షతన నిర్వహించిన న్యాయవాదుల సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. న్యాయవాదుల ప్రమాద బీమా నగదు రూ.4 లక్షలకు ప్రభుత్వం మరో రూ.6 లక్షలు కేటాయించాలన్నారు. జూనియర్ కోర్టు పరిధి కేసులను రూ.20 లక్షల నుంచి తగ్గించాలన్నారు. న్యాయవాదులకు హెల్త్ బీమా స్కీంను వర్తింపచేయాలన్నారు. స్థానిక సబ్‌కోర్టు నిర్మాణానికి ఎస్టిమేట్ సరిపోలేదని దీనిని రూ.కోటి 77లక్షలకు పెంచాలన్నారు. మంత్రి స్పందిస్తూ ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీవో విచారణ



భీమడోలు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఎల్‌పీవో అమ్మాజీ

సాక్షి, టాస్క్‌ఫోర్స్: భీమడోలు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై శుక్రవారం ఏలూరు డీఎల్‌పీవో బృందం విచారణ నిర్వహించింది. ఐదు నెలల కాలంలో రూ.కోటికి పైగా నిధులు పంచాయతీ కార్యదర్శి దుర్వినియోగం చేసినట్లు పంచాయతీ పరిధిలోని నాచేటిగుంటకు చెందిన కొత్తపల్లి చంద్రమౌళి రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసారు. ఈ నేపథ్యంలో భీమడోలు పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో అమ్మాజీ విచారణ చేశారు. పంచాయతీలోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. కార్యదర్శి కేవీ తనూజ, ఫిర్యాదుదారుడైన, దళిత నాయకుడు కొత్తపల్లి చంద్రమౌళిల నుంచి వేర్వేరుగా స్టేట్‌మెంట్లు స్వీకరించారు. అనంతరం డీఎల్‌పీవో మాట్లాడుతూ రిజిస్టర్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, తగు నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాము సునీతా, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో సాధికారత



విద్యార్థులతో నిట్ డీన్ వీరేశ్‌కుమార్

తాడేపల్లిగూడెం: సాంకేతిక నైపుణ్యాలతోనే యువత సాధికారత సాధించవచ్చని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ కెరీర్ అలుమ్ని అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ జీబీ.వీరేశ్‌కుమార్ అన్నారు. నిట్‌లో శుక్రవారం కార్పొరేట్ ఫెస్టు జరిగింది. వీరేశ్ కుమార్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించడానికి సమకాలీన, సృజనాత్మకత ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. మెర్సిడెస్ బెంజ్ సీనియర్ ఇంజనీర్ అయ్యర్ భట్టాచార్య మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం అన్నారు. టి.హబ్ డైరెక్టర్ అవినాష్ కేదార్ అంకుర పరిశ్రమలు ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయని వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. ఫ్యూజీటెక్ ఉపాధ్యక్షుడు చాణిక్య, ప్లేస్‌మెంటు ఆఫీసర్ శంకర్, 23 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. శనివారం ప్రాజెక్టు ఎక్స్‌పో నిర్వహించనున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మహిళ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రకాశం జిల్లా వినుకొండకు చెందిన అపురూప తన భర్తతో యనమదుర్రు గ్రామంలో ఉంటుంది. భర్త మిర్చి వ్యాపారం చేస్తుండగా పనిమీద బయటకు వెళ్లి వచ్చే సరికి భార్య ఇంటి వద్ద లేదని బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం లేదని, అపురూప తల్లి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై ఐ వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా స్థాయిలో సెప్టెంబర్ 5న నిర్వహించే గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అందించే అవార్డుల కోసం జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలోతెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు వారి దరఖాస్తులను సంబంధిత తనిఖీ అధికారులకు ఈ నెల 26 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని, కనీసం 10 సంవత్సరాల సేవా కాలం పూర్తి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

ఏఎస్పీ సూర్యచంద్ర రావు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దడానికి యువత సహకరించాలని జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్య చంద్రరావు పిలుపునిచ్చారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమాన్ని స్థానిక సీఆర్ రెడ్డి కాలేజీలో శుక్రవారం ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, ఏలూరు జిల్లా శక్తి టీం సభ్యులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రజలందరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా మత్తు పదార్థాల వ్యాపారం లేదా వినియోగం చేస్తే 1972కు లేదా పోలీసులకు, డయల్ 112 ద్వారా సమాచారం అందించాలని కోరారు.